




కాటన్ బ్యారేజీపై రాకపోకలు

నిలిపివేత



రామేశం మెట్ట

కొండ.. గుండ

(పెద్దాపురం)

గ్రావెల్ మాఫియా ధన దాహానికి పచ్చని కొండలు కనుమరుగవుతున్నాయి. పర్యావరణానికి సైతం పెనుముప్పు వాటిల్లుతోంది. పెద్దాపురం డివిజన్ పరిధిలో ఉన్న రామేశం పేట మెట్టపై వందలాది ఎకరాల్లో సాగవుతున్న పంటలకు తీవ్ర ముప్పు వాటిల్లింది. ఈ మెట్టనే నమ్ముకుని బతుకుతున్న దళితుల నోట్లో మట్టికొట్టి మైనింగ్ మాఫియా పచ్చ దనానికి చిచ్చుపెట్టింది.

- రామేశంమెట్టలో ఆగని గ్రావెల్ తవ్వకాలు
- మూడు రోజుల కిందట 13 టిప్పర్లు, రెండు ఎక్సకవేటర్ల సీజ్
- తవ్వకాలు కొనసాగించేందుకు సమావేశమైన గ్రావెల్ మాఫియా
- మా దందాకే అడ్డొస్తారా అంటూ అధికారులకు బెదిరింపులు
- అనుమతులు లేకుండానే గ్రావెల్ తవ్వి దోచుకుంటున్న గ్రావెల్ మాఫియా
- ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి

దళితుల పొట్టకొట్టి

సుమారు 823 ఎకరాల్లో విస్త రించి ఉన్న ఈ రామేశంపేట మెట్టపై ప్రభుత్వం ఇచ్చిన భూములను దళిత రైతులు సాగు చేసుకుంటూ తమ జీవితాలను వెళ్లదీస్తున్నారు. అమాయక దళితులకు మాయమాటలు చెప్పి వారిని మభ్యపెట్టి తక్కువ మొత్తానికే భూములను స్వాధీనం చేసుకుని అక్రమంగా తవ్వకాలను ప్రారంభించారు. అయితే అధికార పార్టీ నేతల అండదండలతో గ్రావెల్ మాఫియా పేట్రేగిపోవడంతో పంటలకు తీవ్ర ముప్పు ఏర్పడింది. ముఖ్యంగా ఈ మెట్టపై జీడి మామిడితో పాటు అంతర పంటలను సైతం పండించుకుంటున్నారు. ఎకరానికి నెలకు రూ.మూడు వేల చొప్పున రైతులకు ఆదాయం వస్తుండడంతో వందలాది మంది రైతులు లబ్ధి పొందుతున్నారు.

నాయకుల బెదిరింపులు

గ్రావెల్ అక్రమ తవ్వకాలకు అడ్డువస్తున్న అధికారులపై వైసీపీ నేతలు బెదిరింపులకు పాల్ప డుతున్నారు. ఈనెల 27వ తేదీన రెవెన్యూ, మైన్స్ అధికారులకు అక్రమ గ్రావెల్ తవ్వకాలపై ఫిర్యాదు రావడంతో సంయుక్తంగా దాడులు చేపట్టారు. గ్రావెల్ అక్రమ తవ్వకాలు సాగిస్తున్న 13 టిప్పర్లు, రెండు ఎక్సకవేటర్లు అధికారులు సీజ్ చేశారు. దీంతో వైసీపీ నాయకులకు చిర్రెత్తుకొచ్చింది. మా టిప్పర్లనే సీజ్ చేస్తారా అంటూ అధికారులపై చిందులేశారు. బెదిరింపులకు దిగారు. దీంతో అధికారులు చేసేదేమీలేక కేవలం టిప్పర్ ఒక్కింటికి రూ.10 వేల చొప్పున 13 టిప్పర్లకు కలిపి రూ. 1.30 లక్షలు ఫైన్ వేసి లారీలను విడిచిపెట్టేశారు.



తరలిపోతున్న గ్రావెల్

రహస్య సమావేశం

రామేశంమెట్టలో గ్రావెల్ అక్రమ తవ్వకాలను యథావిధిగా సాగించేందుకు కొంతమంది వైసీపీ నేతలు రహస్యంగా సమావేశమయినట్లు తెలిసింది. ఇటీవల రెవెన్యూ, మైన్స్ అధికారులు దాడులు చేసి తమ వాహనాలను సీజ్ చేయడంతో ఒకింత ఉక్కిరిబిక్కిరి అయినట్లు తెలుస్తోంది. తమ దందాకు అడ్డు తగలకుండా మళ్లీ గ్రావెల్ అక్రమ తవ్వకాలు సాగించేందుకు ప్రయత్నాలను ముమ్మరం చేశారు. ఇప్పటికే చాలా వరకూ ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొట్టేశారు. ఇకపై తమకు ఎటువంటి అడ్డు లేకుండా తమ అక్రమ తవ్వకాల దందాను కొనసాగించేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేసుకుంటున్నట్లు తెలుస్తోంది.

పర్యావరణానికి ముప్పు

మెట్టపై ఉన్న పంటలను పూర్తిస్థాయిలో నాశనం చేయడం కారణంగా పర్యావరణానికి పెనుముప్పు వాటిల్లే ప్రమాదం లేకపోలేదని పలువురు పర్యావరణవేత్తలు ఆందోళన చెందుతున్నారు. ప్రకృతి సంపదను దోచుకునేందుకు చట్టాల్లో ఉన్న లొసుగుల ఆధారంగా మైనింగ్ మాఫియా యథేచ్ఛగా గ్రావెల్‌ను తరలించేస్తోంది. ఈవిషయంపై అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరించడంపై పలువురు చర్చించుకుంటున్నారు.

కన్ను పడితే కబ్జా

(పిఠాపురం)

- ఖాళీ స్థలాలపై అధికార పార్టీ నేతల కన్ను
- కబ్జా చేసేందుకు పన్నాగాలు
- రంగంలోకి దిగుతున్న అనుచరగణం
- పిఠాపురం జగ్గయ్యచెరువు ఖాళీ స్థలాల్లో పాగా
- రాత్రికి రాత్రే స్థలాల్లో చదును
- మున్సిపల్ కౌన్సిలర్లతో పాటు తమ అనుచరులకు ఇచ్చుకునేలా నేతల ప్రయత్నాలు
- జిల్లా కలెక్టరుకు ఫిర్యాదుల వెల్లువ

అవన్ని కోట్లు విలువ చేసే ఖాళీ స్థలాలు. దీంతో వాటిపై అధికార పార్టీ నేతల కన్ను పడింది. సదరు స్థలాల్లో ఉన్న తుప్పలు కొట్టి చదును చేసి ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొందరు ప్రజాప్రతినిధులు వీటిని తమ వారికి ఇప్పించుకునేందుకు సన్నాహాలు చేస్తుండటంతో విషయం వెలుగుచూసింది. దీంతో పలువురు జిల్లా కలెక్టరుకు ఫిర్యాదు చేశారు. పిఠాపురం పట్టణంలోని జగ్గయ్యచెరువు కాలనీపై ఇప్పుడు అధికార పార్టీ నేతల కన్ను పడింది. ఎక్కడ ఖాళీ స్థలం కనపడినా వదలడం లేదు. తమ అనుచరగణాన్ని రంగంలోకి దింపి వాటిని కబ్జా చేసే ప్రయత్నం చేస్తున్నారు..





పిఠాపురం పట్టణం జగ్గయ్యచెరువు కాలనీలో తుప్పలు కొట్టి చదును చేసిన స్థలం



జగ్గయ్యచెరువు కాలనీలో ప్రభుత్వ శాఖలకు కేటాయించగా ఖాళీగా ఉన్న స్థలాలు

జగ్గయ్య చెరువుపై కన్నుపడింది..

పిఠాపురం పట్టణంలోని జగ్గయ్యచెరువు కాలనీలో మూడు దశాబ్దాల నుంచి వందల సంఖ్యలో పేదలకు ఇళ్ల స్థలాలుగా అందించారు. 130 ఎకరాల విస్తీర్ణం గల ఈ చెరువు ఇప్పుడు ప్రత్యేక కాలనీగా రూపొందింది. ఇక్కడ పేదలకు ఇళ్లస్థలాలు, రాజీవ్‌గృహకల్ప అపార్ట్‌మెంట్లు, ప్రభుత్వ కార్యాలయాలకు స్థలాలు కేటాయించగా ఇంకా పలు చోట్ల ఖాళీ స్థలాలు ఉన్నాయి. కాలనీలోని సివిల్ సప్లైస్ గొడౌన్స్ వెనుక భాగంలో మండల పరిషత్ కార్యాలయం సమీపంలో 85 సెంట్లు, 1.20 ఎకరాలు వంతున ఖాళీ స్థలాలు ఉన్నాయి. ఇవి కాక పలు ప్రాంతాల్లో ఖాళీ ప్రదేశాలు ఉన్నాయి. ఇందులో కొంత భాగాన్ని మూడు ప్రభుత్వ శాఖలకు కేటాయించినా వారు అక్కడ ఎటువంటి నిర్మాణాలు చేపట్టకపోవడంతో అవన్ని ఖాళీగానే ఉన్నాయి. బహిరంగ మార్కెట్‌లో ఇక్కడ స్థలాలు విలువ కోట్లలో ఉంది. సెంటు ఖాళీ స్థలం ధర రూ. 3 లక్షలు నుంచి 6లక్షలు వరకూ ఉంది. దీనితో అధికార పార్టీ నేతల కన్నుపడింది. ఖాళీగా ఉన్న స్థలాలను ప్లాట్లుగా విభజించి తమతో పాటు తమ అనుచరులకు ఇప్పించుకుని అందులో పాగా వేయాలని భావిస్తున్నారు.

రాత్రికి రాత్రే

ఖాళీస్థలాలపై కన్ను వేసిన అధికార వైసీపీ నేతలు సదరు స్థలాల్లో ఉన్న తుప్పలను మూడు రోజుల క్రితం రాత్రికి రాత్రే తొలగించి అక్కడ శుభ్రం చేయడంతో పాటు కొంత మేర చదును చేశారు. ఈ స్థలాలను మునిసిపల్ కౌన్సిలర్లతో పాటు తమ అనుచరులకు ఇప్పించుకోవాలని కొందరు అధికార పార్టీ నేతలు ప్రయత్నాలు ప్రారంభించారు. ఈ మేరకు నియోజకవర్గ కీలక నేతలతో రెవెన్యూ అధికారులపై ఒత్తిడి తెచ్చినట్లు సమాచారం. కోట్లు విలువ చేసే ఖాళీ స్థలాలను అధికార పార్టీ నేతలు కబ్జా చేసే ప్రయత్నం చేస్తున్నారంటూ మాల మహాగర్జన, సీపీఐ, బీఎస్పీ నాయకులు ఈనెల 27వ తేదీ రాత్రి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో రెవెన్యూ, పోలీసు సిబ్బంది వెళ్లి చదును చేసే పనులు అడ్డుకున్నారు. సిబ్బంది వెళ్లిపోయిన తర్వాత పనులు యథావిధిగా సాగాయి. ప్రస్తుతం ఈ స్థలాలకు ఎల్‌పీసీలు తీసుకునేలా అధికార పార్టీ నేతలు పావులు కదుపుతున్నారని వివిధ సంఘాల నాయకులు ఆరోపించారు.

పట్టాలు పుట్టుకొచ్చాయి

నకిలీలలు

జగ్గయ్యచెరువు కాలనీలో ఇళ్లపట్టాల వ్యవహారం ఎప్పుడూ వివాదాస్పదమే. ఇక్కడ గతంలో పనిచేసిన తహసీల్దార్ల సంతకాలతో ఇప్పటికి కొత్తగా పట్టాలు పుట్టుకువస్తున్నాయి. ఏది నకిలీయో, ఏది అసలో అధికారులే తేల్చలేకపోతున్నారు. ఎక్కడయినా ఖాళీస్థలం కనిపిస్తే దానికి క్షణాల్లో పట్టా తయారు చేసి విక్రయించేస్తున్నారు. ఇక్కడ స్థలాల విలువ గణనీయంగా పెరిగిపోవడంతో నకిలీ పట్టాలు తయారు చేసి అమ్మకాలు సాగించే వారు పెరిగిపోతున్నారు. ఇక్కడ ఉన్న వారిలో పలువురివి నకిలీ పట్టాలు అని తెలిసినా ఇప్పటికే వారు గృహాలు నిర్మించుకుని నివాసముంటున్న నేపథ్యంలో అధికారులు ఏమి చేయలేని పరిస్థితి ఉంది. మరోవైపు ఇప్పటికీ కొత్త నిర్మాణాలు జరుగుతూనే ఉన్నాయి.



ధర్నా చేస్తున్న సంఘాలు

కబ్జాలను అడ్డుకోండి

పట్టణంలోని జగ్గయ్యచెరువు కాలనీలో సివిల్ సప్లైస్ గొడౌన్ వెనుక ఉన్న 85 సెంట్లు స్థలంతో పాటు ఇతర ఖాళీ స్థలాలును అధికార పార్టీ నేతలు కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని, వీటిని అడ్డుకోవాలని సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు సాకా రామకృష్ణ, కేశవరపు అప్పలరాజు, బహుజన సమాజ్ పార్టీ పిఠాపురం నియోజకవర్గ కన్వీనర్ ఖండవిల్లి లోవరాజు జిల్లా కలెక్టరు కృతికాశుక్లా, ఇతర ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వస్థలాన్ని ఆక్రమించుకునేందుకు మునిసిపల్ కౌన్సిలర్లు ప్రయత్నిస్తున్నారని వారు ఆరోపించారు. ఇప్పటికే ఆ స్థలాలను ఎక్స్‌కవేటర్లతో చదును చేశారని తెలిపారు. మరో వైపు ఈ స్థలాలకు ఎల్‌పీసీలు, పట్టాలు ఇచ్చేందుకు రంగం సిద్ధం చేస్తున్నారని చెప్పారు. పేదల భూములను ప్రజాప్రతినిధులు, అధికార పార్టీ నేతలకు ఎలా ఇస్తారని వారు ప్రశ్నించారు. అర్హులైన పేదలు ఎంతో మంది ఉన్నారని వారికి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

టీడీఆర్ బాండ్లపై సమరం

- కబ్జా చేయడానికి కనిపించిన పోర్టు భూములు
- సబ్ స్టేషన్ నిర్మాణానికి కనిపించలేదా?
- మాజీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు



గతంలో కబ్జాకు గురైన పోర్టు భూములను చూపుతున్న కొండబాబు

కాకినాడ సిటీ, జనవరి 30 : కబ్జా చేయడానికి కనిపించే పోర్టు భూములు ప్రజా అవసరాలకు ఉపయోగపడే సబ్‌స్టేషన్ నిర్మాణానికి కనిపించకపోవడం విడ్డూరంగా ఉందని కాకినాడ సిటీ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి విమర్శించారు. ఎందుకు పనికిరాని ప్రైవేటు భూమిపై రూ.251 కోట్లు టీడీఆర్ బాండ్లు మంజూరు చేయించి ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి దోచుకున్నారని ఆరోపించారు. ఎలక్ట్రికల్ సబ్ స్టేషన్ నిర్మాణానికి దుమ్ములపేట ప్రాంతంలో 1:4 నిష్పత్తిలో టీడీఆర్ బాండ్లు మంజూరు చేసి కార్పొరేషన్ సేకరించిన 4.67 ఎకరాల భూమిని, గతంలో కబ్జాకు గురైన పోర్టు భూములను మంగళవారం కొండ బాబు మీడియాకు చూపించి ఆ ప్రదేశంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ కాకినాడ నగరంలో కబ్జాలు చేయడానికి కనిపించిన పోర్టు భూములు నగర అభివృద్ధికి కనిపించలేదన్నారు. ఎలక్ట్రికల్ సబ్‌స్టేషన్ పేరుతో ఎందుకు పనికిరాని ప్రైవేటు భూమిని సేకరించి వాటికి రూ.251 కోట్ల బాండ్లు మంజూరు చేయించి కార్పొరేషన్ ఖజానాకు గండి కొట్టారన్నారు. గత టీడీపీ ప్రభుత్వమే టీడీఆర్ బాండ్ల జీవో తెచ్చిందని చెబుతున్న ద్వారంపూడి భూ సేకరణ సమయంలో సామాన్య ప్రజలు ఇబ్బంది పడకూడదని తప్ప దీనిని అడ్డుపెట్టుకుని దోచుకోవాడనికి కాదన్నారు టీడీఆర్ బాండ్లతో కార్పొరేషన్ ఖజానాకు నష్టం లేదని చెబుతున్న ద్వారంపూడి మరి టీడీఆర్ బాండ్లు దేనికి ఇచ్చినట్లో చెప్పాలన్నారు. ఎలక్ట్రికల్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి నగరంలో పోర్టు భూములు ఉన్నాయని, గతంలో పూలే పాకల వద్ద 8 ఎకరాల పోర్టు భూమిని రాత్రికి రాత్రి గ్రావెల్‌తో నింపి కబ్జా చేస్తే తాము అధికారుల దృష్టికి తెచ్చి ఆ భూములు కాపాడామన్నారు. ఆ భూములు ఎలక్ట్రికల్ సబ్ స్టేషన్ నిర్మాణానికి ద్వారంపూడికి పనికిరావా అని కొండబాబు ప్రశ్నించారు. గతంలో సామర్లకోట రోడ్డు విస్తరణ, కొండయపాలెం ఫ్లై ఓవర్ నిర్మాణం, మెయిన్‌రోడ్ విస్తరణకు ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించి భూములను సేకరించామని, ద్వారంపూడిలా కార్పొరేషన్ ఖజానాను కొల్లగొట్టేలా టీడీఆర్ బాండ్లు మంజూరు చేయించలేదన్నారు. అలాగే పేద వర్గాల కోసం పోర్టు భూములు సేకరించి టిడ్కో ఇళ్లు కట్టించామన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో నిర్మించిన టిడ్కో ఇళ్లకు వైసీపీ రంగులు వేసి గొప్పలు చెప్పుకుంటున్నందుకు ద్వారంపూడి సిగ్గు పడ్డాలన్నారు. సురేష్‌నగర్‌లో పార్కు ప్రభుత్వ భూమికి రూ.160 కోట్ల టీడీఆర్ బాండ్లు, సబ్‌స్టేషన్ పేరుతో దుమ్ములపేట భూములకు రూ.251 కోట్ల టీడీఆర్ బాండ్లు మంజూరు చేసిన అధికారులకు ఒక సన్మానం ఏమిటీ ద్వారంపూడి ఇంకేమైనా చేయగలడని కొండబాబు ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు, తుమ్మల రమేష్, వొమ్మి బాలాజీ, బంగారు సత్యనారాయణ, చోడిపల్లి సతీష్, కొండ్రు తాతారావు, చోడిపల్లి ప్రేమానందం పాల్గొన్నారు.



నేడు జేఎన్టీయూకే

స్నాతకోత్సవం

- హాజరుకానున్న గవర్నర్
- పూర్తయిన ఏర్పాట్లు

కాకినాడ జేఎన్టీయూ పదో స్నాతకోత్సవానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. బుధవారం ఉదయం 10.30 గంటల నుంచి అలూమ్ని ఆడిటోరియంలో ఈ వేడుక ఘనంగా జరగనుంది. స్నాతకోత్సవానికి కులపతి, రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్‌నజీర్ ముఖ్య అతిథిగా విచ్చేస్తున్నారు. ఈ మేరకు వర్సిటీ ప్రాంగణంలో ఘనంగా ఏర్పాట్లు చేశారు. పోలీసు అధికారులు బందోబస్తు చర్యలు తీసుకున్నారు. వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు హాజరుకానున్నారు.

ఇన్సూరెన్స్ బకాయిలు

తక్షణం చెల్లించాలి



ధర్నా నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే వర్మ, నాయకులు, కార్యకర్తలు

పిఠాపురం, జనవరి 30: సహకార సంఘాల ద్వారా రైతులకు రావాల్సిన ఇన్సూరెన్స్ బకాయిలను తక్షణం చెల్లించాలంటూ పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం ధర్నా నిర్వహించారు. టీడీపీ కార్యాలయం నుంచి ప్రధాన రహదారి మీదుగా ప్రదర్శనగా చర్చి సెంటర్‌కు చేరుకుని అక్కడ ఆందోళన చేపట్టారు అక్కడ ధర్నా, రాస్తారోకో జరిపారు. అనంతరం డీసీసీబీ పిఠాపురం బ్రాంచి కార్యాలయానికి వెళ్లి అక్కడ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వర్మ మాట్లాడుతూ పిఠాపురం నియోజకవర్గంలోని గొల్లప్రోలు, చేబ్రోలు, చెందుర్తి, పి.రాయవరం, పి.దొంతమూరు, అగ్రహారం, ఇసుకపల్లి, నాగులాపల్లి, కొత్తపల్లి, కొమరగిరి, యండపల్లి తదితర సొసైటీల పరిధిలో రైతులకు పంటల బీమా బకాయిలు రూ.10 కోట్లుకు పైగా ఉనాన్నయన్నారు. 2020 నుంచి ఈ సొమ్ములు ఇవ్వకుండా రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. సొసైటీలు నుంచి రైతులు రుణాలు తీసుకోవడమే వారు చేసిన పాపమా అని ప్రశ్నించారు. అందరికి పంట కాలంలోనే బీమా అందించామని జగన్ గొప్పలు చెప్పుకుంటున్నారని, వాస్తవంలో పరిస్థితి అందుకు విరుద్ధంగా ఉందని తెలిపారు. పంటల బీమా ఇవ్వకుండా ఎగ్గొట్టాలనే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. సైకో జగన్ రైతులకు జరిగిన పంట నష్టానికి పరిహారం కూడా ఇవ్వడం లేదని మండిపడ్డారు.

వైసీపీ నాయకుడిని అరెస్టు చేయాలి

జిల్లా అధికారుల సమక్షంలో మత్స్యశాఖ ఉద్యోగిపై దాడి చేసిన కొత్తపల్లి మాజీ జడ్పీటీసీ, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి రావు చిన్నారావును తక్షణం అరెస్టు చేయాలని మాజీ ఎమ్మెల్యే వర్మ డిమాండ్ చేశారు. వీడియోల్లో అంతా స్పష్టంగా ఉన్నా, జిల్లా అధికారులు ఉండగానే ప్రభుత్వ ఉద్యోగిపై దౌర్జన్యం చేసి కొడితే ఇంత వరకూ అరెస్టు చేయకపోవడం ఏమిటని ప్రశ్నించారు. ఎంపీ, ఎమ్మెల్యే అండదండలతోనే ఇటువంటి సంఘటనలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. ఎంపీ ఇన్‌చార్జిగా వచ్చిన తర్వాత ఇలాంటి పరిస్థితి ఉంటే ఇక్కడ ఎన్నికయితే పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చునని తెలిపారు. కార్యక్రమాల్లో టీడీపీ పట్టణ, మండల శాఖ అధ్యక్షుడు రెడ్డెం భాస్కరరావు, సకుమళ్ల గంగాధర్, అనిశెట్టి సత్యానంద రెడ్డి, మాజీ జడ్పీటీసీ బర్ల అప్పారావు, సూరవరపు సుబ్బారావు, నల్లా శ్రీను, అల్లవరపు నగేష్, రాయుడు శ్రీను, అందుగుల సత్తిబాబు పాల్గొన్నారు.

నేడు జేఎన్టీయూకే 10వ స్నాతకోత్సవం


అలూమ్నీ ఆడిటోరియం లాన్‌లో స్నాతకోత్సవ ఏర్పాట్లుచేస్తున్న దృశ్యం

- రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ రాక
- టీసీఎస్ ప్రెసిడెంట్ వి.రాజన్నకు గౌరవ డాక్టరేట్
- పలువురికి పీహెచ్‌డీ, డిగ్రీ పట్టాలు, బంగారు పతకాలు ప్రదానం
- ఏర్పాట్లు పూర్తి ● స్నాతకోత్సవానికి రిహార్సల్స్
- ఉదయం 10.30 నుంచి ఆరంభం

జేఎన్టీయూకే, జనవరి 30: కాకినాడ జేఎన్టీయూకే 10వ స్నాతకోత్సవంను బుధవారం ఉదయం 10.30నుంచి అలూమ్ని ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు ఉపకులపతి ప్రొఫెసర్ జీవీఆర్ ప్రసాదరాజు తెలిపారు. దీనికి సంబందించి వర్శిటీలోని వీసీ సమావేశ హాల్లో మంగళవారం డీఏపీ, పీఆర్వో ప్రొఫెసర్ సీహెచ్ సాయిబాబు అధ్యక్షతన నిర్వహించిన మీడియా సమావేశంలో వీసీ పాల్గొని స్నాతకోత్సవ నిర్వహణ వివరాలను వెల్లడించారు. ఈసందర్భంగా వీసీ మాట్లాడుతూ 2022-23 విద్యా సంవత్సరంలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు డిగ్రీలు, 64 మంది పరిశోధక విద్యార్థులకు పీహెచ్‌డీ పట్టాలు, ప్రతిభావంతులైన విద్యార్థులకు 28 బంగారు, ఎండోమెంట్ పతకాలు ప్రధానంచేస్తారన్నారు. అదేవిధంగా బీటెక్ 34,199, బీఫార్మసీ 1477, ఎంటెక్ 1689, ఎంబీఏ 1093, ఎంసీఏ 343, ఎంఫార్మసీ 332, బీబీఏ 21, ఫార్మాడీ 182, బీఆర్క్ 13మంది విద్యార్థులకు సంబంధిత డిగ్రీలను ప్రధానం చేస్తారన్నారు. స్నాతకోత్సవానికి కులపతి, రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్‌నజీర్ అధ్యక్షత వహిస్తారని, మాజీ నేవీ రియర్ అడ్మిరల్ ఎస్.వెంకటశేషాచారి ముఖ్యఅతిథిగానూ, విద్యాశాఖామంత్రి బొత్స సత్యనారాయణ ప్రత్యేక అతిథిగానూ పాల్గొంటారని తెలిపారు. టీసీఎస్ టెక్నాలజీ, సాఫ్ట్‌వేర్ సర్వీసెస్ ప్రెసిడెంట్ వి.రాజన్నకు వర్శిటీ తరపున గౌరవ డాక్టరేట్‌ను ప్రధానం చేస్తారన్నారు. స్నాతకోత్సవ వేడుకలకు పాలకమండలి సభ్యులు, మాజీ ఉపకులపతులు, రాష్ట్ర ఉన్నతవిద్యామండలి ఛైర్మన్ హేమచంద్రారెడ్డి, ఉన్నతవిద్యాశాఖాధికారులు వర్శిటీ అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది పూర్వవిద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. సమావేశంలో రెక్టార్ కేవీ రమణ, రిజిస్ట్రార్ ఎల్.సుమలత, ఓఎస్‌డీ కోటేశ్వరరావు, పరిశోధనాభివృద్ధి డైరెక్టర్ వి.రవీంద్ర పాల్గొన్నారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయని వీసీ తెలిపారు. సాయంత్రం స్నాతకోత్సవం రిహార్సల్స్‌ను వీసీ అధ్యక్షతన నిర్వహించారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న వీసీ జీవీఆర్ ప్రసాదరాజు

స్నాతకోత్సవానికి ముఖ్యఅతిథిగా ఎస్వీ శేషాచారి



జేఎన్టీయూకే, జనవరి 30: కాకినాడ జేఎన్టీయూకే 10వ స్నాతకోత్సవానికి ముఖ్యఅతిథిగా విచ్చేయుచున్న మాజీ నేవీ రియర్ అడ్మిరల్ ఎస్.వెంకటశేషాచారి కాకినాడలోని ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యనభ్యసిస్తున్నప్పుడు యూనివర్శిటీ ఎంట్రీ స్కీమ్ కింద ఇండియన్ నేవీలోని ఎలక్ట్రికల్ విభాగంలో నియమితులయ్యారు. ఐఎన్ఎస్ రాణా, రణవీర్ సబ్‌మెరైన్‌లలో సేవలందించి ఐఎన్ఎస్ కళింగట్ విశాఖపట్నం క్షిపణి స్థాపనలో ముఖ్యపాత్ర పోషించారు. అంతేకాకుండా ఆయన నౌకలు, జలాంతర్గాములు రెండింటికీ అనేక పరికరాలు, వ్యవస్థల స్వదేశీకరణలో కీలకపాత్ర పోషించారు. రష్యాలోని పొటిబ్లాక్ సీ పోర్టులో ఎక్విప్‌మెంట్ ఓరియంటెడ్ కోర్సు, సికింద్రాబాద్‌లోని కాలేజ్ ఆఫ్ డిఫెన్స్ మేనేజ్‌మెంట్ కోర్సు, న్యూఢిల్లీలోని నేషనల్ డిఫెన్స్ కళాశాలలో ఎన్‌డీసీ కోర్సు పూర్తిచేశారు. నేవీలో ఆయన అందించిన సేవలకుగానూ భారత ప్రభుత్వం విశిష్ట సేవా పతకంతో సత్కరించింది. మజగాన్ డాక్‌లిమిటెడ్(ఎండీఎల్)లో షిప్ డైరెక్టరుగా ఎంపికైన తరువాత 22 మార్చి 2007లో రియర్ అడ్మిరల్ హోదాలో ఇండియన్ నేవీ నుంచి తాత్కాలిక పదవీ విరమణ చేశారు. అణు జలాంతర్గాములు, నౌకాదళ నౌకలకోసం వివిధ పరికరాలు, వ్యవస్థలను రూపొందించడంలో వెంకటశేషాచారి కీలకపాత్ర పోషించారు.

ఆయనొక బహుముఖ ప్రజ్ఞాశాలి

- టీసీఎస్ ప్రెసిడెంట్ రాజన్నకు జేఎన్టీయూకే గౌరవ డాక్టరేట్



జేఎన్టీయూకే, జనవరి 30: రేపు నిర్వహించనున్న కాకినాడ జేఎన్టీయూకే 10వ స్నాతకోత్సవానికి గౌరవ డాక్టరేట్ అందుకునేందుకు విచ్చేయు చున్న టీసీఎస్ టెక్నాలజీ, సాఫ్ట్‌వేర్‌సర్వీసెస్ ప్రెసిడెంట్ వి.రాజన్న బహుముఖ ప్రజ్ఞాశాలి. ఆయన 30ఏళ్ల నుంచి విద్యావ్యవస్థలు, పరిశ్రమలు, ప్రభుత్వ విభాగాలలో తనదైన శైలిలో ముద్రవేశారు. మానవ వనరులు, సేల్స్ పరిశోధనాభివృద్ధి, విద్య మార్కెటింగ్ తదితర అంశాలలో అమెరికా, చైనా, తైవాన్, సింగపూర్ దేశాలు ఆయన సాంకేతిక అనుభవాన్ని వినియోగించుకుంటున్నాయి. రాజన్న ప్రస్తుతం టీసీఎస్‌లో సీనియర్ వైస్ ప్రెసిడెంట్‌గానూ గ్లోబల్ హెడ్ ఆఫ్ ద కమ్యూనికేషన్స్, మీడి యా, టెక్నాలజీ గ్రూపులకు తన సేవలను అందిస్తున్నారు. ఆయన నాయకత్వంలో హైదరాబాద్‌లోని టీసీఎస్ ప్రపంచస్థాయిలో 3వ స్థానం సంపాదించడంతో పాటూ 4500 ఉద్యోగాల నుంచి 90 వేల ఉద్యోగాలను టీసీఎస్ కల్పించింది. జేఎన్టీయూకేతో పాటూ పలు అనుబంధ కళాశాలలకు బీఓఎస్ సభ్యునిగా వ్యవహరించి పైథాన్, వెబ్‌టెక్నాలజీ, మొబైల్ కంప్యూటింగ్, బ్లాక్ చైన్‌టెక్నాలజీలలో సిలబస్ రూపకల్పనకు కృషిచేశారు.

● సాధించిన అవార్డులు

ఐటీ పరిశ్రలకు రాజన్న అందించిన సేవలను గుర్తించి గవర్నమెంట్ ఆఫ్ జిజియాంగ్‌వెస్ట్ లేక్ ఫ్రెంచ్ షిప్ అవార్డును అందించారు. అదేవిధంగా 2007లో ఐటీ ప్రొఫెషనల్ ఆఫ్‌ది ఇయర్‌గా అవార్డును హెచ్ఎంఏ అందించింది. 2012లో నాయుడమ్మ పురస్కారాన్ని ఏపీ ప్రభుత్వం ప్రధానం చేసింది. 2016లో ఎన్ఐటీ వరంగల్ నుంచి విశిష్ట పూర్వ విద్యార్థి అవార్డును, 2019లో విజ్ఞాన్ వర్శిటీ గౌరవ డాక్టరేట్‌ను అందించింది. అంతేకాకుండా హైదరాబాద్ మేనేజ్‌మెంట్ అసోషియేషన్ (హెచ్ఎంఏ) ఆయనకు 2023లో లైఫ్‌టైమ్ ఎచీవ్‌మెంట్ పురస్కారాన్ని అందించింది.

‘నన్నయ’లో నేడు పట్టాల పండుగ

- స్నాతకోత్సవానికి ఏర్పాట్లు పూర్తి
- రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ రాక
- ఇన్ఫోసిస్ ఫౌండేషన్ చైర్‌పర్సన్‌కు గౌరవ డాక్టరేట్

దివాన్‌చెరువు, జనవరి 30: ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం 13, 14, 15వ స్నాతకోత్సవానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. విశ్వవిద్యాలయంలోని ఎస్టీఆర్ కన్వెన్షన్ భవనంలో బుధవారం మధ్యాహ్నం 2గంటల నుంచి నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ విచ్చేసి పట్టాల ప్రదానం చేస్తారని వీసీ పద్మరాజు తెలిపారు. ముఖ్యఅతిథిగా ఇన్ఫోసిస్ ఫౌండేషన్ చైర్‌పర్సన్ సుధామూర్తి హాజరై ప్రసంగిస్తారని, విశ్వ విద్యాలయం తరపున ఆమెకు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేస్తామన్నారు. అతిథులుగా ఉన్నత విద్య ప్రిన్సిపల్ కార్యదర్శి జె.శ్యామలరావు, కళాశాల విద్యా కమిషనర్ పోలా భాస్కర్, రాష్ట్ర ఉన్నతవిద్యా మండలి ఛైర్మన్ ఆచార్య కె.హేమచంద్రారెడ్డి తదితరులు విచ్చేయనున్నారని చెప్పారు. పట్టాలు స్వీకరించే వారు సూచించిన నిబంధనలను పాటిస్తూ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఏర్పాట్లు పరిశీలించిన జిల్లా అధికారులు

స్నాతకోత్సవ కార్యక్రమ ఏర్పాట్లను వీసీ పద్మరాజు, ఎస్పీ పి.జగదీష్, జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్ భరత్, ఆర్డీవో ఏ.చైత్రవర్షిణి, నన్నయ రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ తదితర జిల్లా అధికారులు మంగళవారం పరిశీలించారు. సభా ప్రాంగణాన్ని, గవర్నర్ కోసం సిద్ధంచేసిన అతిథి గృహాన్ని పరి శీలించి ట్రైల్ రన్ నిర్వహించారు.


ఏర్పాట్లు పరిశీలిస్తున్న నన్నయ వీసీ, జిల్లా అధికార్లు

నేడు గవర్నర్ పర్యటన ఇలా..

దివాన్‌చెరువు, జనవరి 30: రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్‌నజీర్ బుధవారం జిల్లాలో పర్యటించనున్నారు. మధ్యాహ్నం 12.45గంటలకు కాకినాడ నుంచి బయలుదేరి మధ్యాహ్నం 1.05 గంటలకు గైట్ కళాశాలలోని హెలీప్యాడ్‌కు చేరుకుంటారు. అనంతరం స్థానికంగా ఏర్పాటుచేసిన అతిథిగృహానికి చేరుకుని విరామం తీసుకుంటారు. తదుపరి మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 4.35వరకూ నన్నయ విశ్వవిద్యాలయంలో జరిగే స్నాతకోత్స వంలో పాల్గొంటారు. ఆ తరువాత గైట్ కళాశాలలోని హెలీప్యాడ్‌కు చేరు కుని సా.4.55గంటలకు హెలికాప్టర్‌లో గన్నవరం విమానాశ్రయానికి బయ లుదేరి వెళతారు. అక్కడ నుంచి విజయవాడ రాజభవన్‌కు చేరుకుంటారు.

అంతర్వేది ఉత్సవాలు
వైభవంగా నిర్వహించాలి

- ఏర్పాట్లు పరిశీలించిన ఆర్డీవో కేశవర్ధనరెడ్డి


తెప్పోత్సవం నిర్వహణ పనులను పరిశీలిస్తున్న ఆర్డీవో కేశవర్ధనరెడ్డి

అంతర్వేది, జనవరి 30: బీఆర్ అంబేడ్కర్ కోనసీమజిల్లా సఖినేటిపల్లి మండలం అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామివారి దివ్య తిరు కల్యాణ మహోత్సవాలు ఫిబ్రవరి 16నుంచి 25వ తేదీ వరకు అత్యంత వైభవంగా నిర్వహించాలని అమలాపురం ఆర్డీవో జి.కేశవర్ధనరెడ్డి అన్నారు. మంగళవారం తీర్థ మహోత్సవ ఏర్పాట్లపై ముందుగా ఆలయ చైర్మన్ క్యాబిన్‌లో వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. ఉత్సవ ఏర్పాట్లలో అధికారులందరూ తమ పనితీరును మెరుగుపరుచుకోవాలని, ఉత్సవాలు ప్రారంభమయ్యే నాటికి ఈ ఏర్పాట్లన్నీ పూర్తి చేయాలన్నారు. కల్యాణ మండపం, రథం, చక్రస్నానం, తెప్పోత్సవం ప్రదేశాలను పోలీసు, ఆలయ అధికారులతో ఆర్డీవో మంగళవారం పరిశీలించారు. ఎలక్ట్రికల్ వర్క్స్, పందిర్లు, క్యూలైన్లు, బందోబస్తు, పార్కింగ్ ఏర్పాట్లు, సీసీ కెమెరాల ఏర్పాటుపై సమీక్షించి అనంతరం తెప్పోత్సవం నిర్వహించే మంచినీటి చెరువు పనులు జరుగుతున్న కారణంగా గోదావరిలో లేక అదే మంచినీటి చెరువులో నిర్వహించేందుకు ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులతో మాట్లాడారు. కార్యక్రమంలో రాజోలు సీఐ గోవిందరాజు, సఖినేటిపల్లి ఎస్ఐ ఎస్.రాము, తహసీల్దార్ రమాకుమారి, ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ, ఎంపీటీసీ బైరా నాగరాజు, సర్పంచ్ కొండా జాన్‌బాబు, అధికారులు పాల్గొన్నారు.

రేపటి నుంచి 10 వరకూ
కాటన్ బ్యారేజీపై రాకపోకలు బంద్

రాజమహేంద్రవరం, జనవరి 30(ఆంధ్రజ్యోతి/ఆత్రేయపురం: ధవళేశ్వరం సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజి రోడ్డు మరమ్మతు పనులు వేగంగా చేయడం కోసం ఫిబ్రవరి 1నుంచి 10వతేదీ వరకూ ఈబ్యారేజీని మూసివేసి, రాకపోకలు బంద్ చేస్తున్నట్టు జిల్లా కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత తెలిపారు. రూ.2కోట్లతో ఈపనులు చేపట్టారని, త్వరగా పూర్తవ్వడానికి వీలుగా వాహనాల రాకపోకలు ఆపుతున్నామన్నారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ట్రాఫిక్ మళ్లింపు ఏర్పాట్లు చేయాలని పోలీసు అధికార్లను ఆదేశించారు. ప్రైవేట్ స్కూల్ బస్సులు ప్రత్యామ్నాయ మార్గాలు చూసుకోవాలన్నారు. కొన్నేళ్లుగా బ్యారేజీ ఛిద్రమై అస్తవ్యస్తంగా మారింది. బ్యారేజీని పటిష్టపరచాలని ప్రతిపక్షాలు, ప్రజా సంఘాలు ఆందోళన సైతం నిర్వహించాయి. ఈ నేపథ్యంలో ధవళేశ్వరం నుంచి విజ్జేశ్వరం వరకు బ్యారేజీ, రోడ్డు మరమ్మతులకు ప్రభుత్వం రూ.2 కోట్లు నిధులు మంజూరు చేసింది. ఈ నేపథ్యంలో బ్యారేజీపై తారు పొరలను తొలగించి గోతులు పూడ్చే కార్యక్రమాన్ని చేపడుతున్నారు. బుధవారం నుంచి పది రోజులపాటు వాహనాల రాకపోకలు నిలుపుదల చేస్తున్నట్టు బ్యారేజీ డీఈ ప్రతీప్‌కుమార్ తెలిపారు.


ఆత్రేయపురం మండలం బొబ్బర్లంక బ్యారేజీ వద్ద జరుగుతున్న పనులు

అన్నవరంలో నూతన అన్నదాన
భవనం నిర్మాణానికి ప్రణాళిక!

అన్నవరం, జనవరి 30: ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధికి 2016 నుంచి ఎదురుచూస్తున్న ప్రసాద్ స్కీం నిధులు అతిత్వరలో విడుదలకానున్నాయి. రూ.10కోట్లు మంజూరైనట్లు తెలుస్తోంది. దీనిపై దేవస్థానానికి అధికారికంగా సమాచారం రాకపోయినా రాష్ట్ర టూరిజం శాఖకు కేంద్ర టూరిజంద్వారా సమాచారం అందినట్లు తెలుస్తోంది. ఈ నిధులతో అన్నదానభవనం నిర్మించాలని దేవస్థానం అధికారులు ఆలోచన చేస్తున్నారు. ఈమేరకు మంగళవారం దేవదాయశాఖ డిప్యూటీ స్థపతి శ్రీనివాస ఆచారి సత్యదేవుడి సన్నిధికి విచ్చేసి అన్నదానభవనం ఎక్కడ ఏర్పాటుచేయాలనే దానిపై పరిశీలన చేశారు. టీటీడీ సత్రం తొలగించిన ప్రాంగణాన్ని ఆయన దేవస్థానం ఇంజనీరింగ్ అధికారులతో కలసి పరిశీలించారు. రెండు మూడ్రోజులలో అధికారిక సమాచారం వచ్చిన వెంటనే కాకినాడ ఎంపీతో చర్చించి స్థలపరిశీలన అనంతరం తుది నిర్ణయం తీసుకోనున్నారు. దేవస్థానానికి చేయించే రథాలను డిప్యూటీ స్థపతి మంగళవారం పరిశీలించారు.

సత్యదేవుడిని దర్శించుకున్న
సినీ రచయిత జె.కె.భారవి


సత్యదేవుడి దర్శనానంతరం సినీ రచయత జె.కె భారవి

అన్నవరం, జనవరి 30: ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో మంగళవారం ఆధ్యాత్మిక చిత్రాలైన అన్నమయ్య, శ్రీ రామదాసు, మంజునాథ వంటి చిత్రాలకు రచయితగా పనిచేసిన జె.కె.భారవి స్వామిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ సూపరింటెండెంట్ కృష్ణప్రసాద్ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. దర్శనానంతరం వారికి వేదపండితులు వేదాశీర్వచనాలు అందజేశారు.

స్విమ్మింగ్‌పూల్‌లో పడి బాలుడి దుర్మరణం

- నిర్వాహకుల నిర్లక్ష్యమే కారణమంటూ బంధువుల ఆందోళన

యానాం, జనవరి 30: యానాం ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థి స్విమ్మింగ్‌పూల్లో పడి మృతి చెందిన సంఘటన యానాంలో చోటుచేసుకుంది. పాఠశాలలో మధ్యాహ్నం భోజనం అనంతరం ఆడుకునేందుకు వెళ్లిన విద్యార్థి విగతజీవిగా పడి ఉండటంతో బంధువులు, విద్యార్థులు ఆందోళనకు గురయ్యా రు. స్థానిక అగ్రహారానికి చెందిన సూరిమిల్లి రాజు, శ్యామల దంపతులకు ఇద్దరు కుమారులు. వీరిలో పెద్దకుమారుడు సూరిమిల్లి సాయిరోహిత్ (7) స్థానిక శ్రీకృష్ణదేవరాయ ప్రాథమిక పాఠశాలలో 1వ తరగతి చదువుతున్నాడు. మంగళవారం మధ్యాహ్నం పాఠశాలలో భోజనం చేసిన తరువాత పలువురు విద్యార్థులతో కలిసి ఆడుకునేందుకు బయటకు వెళ్లారు. అక్కడ స్విమ్మింగ్‌పూల్లో ప్రమాదవశాత్తూ జారీ పడిపోయాడు. ఆ సమయంలో తోటి స్నేహితులు తప్ప ఎవ్వరూ లేకపోవడంతో కొంత సమయం గడచిపోయింది. అనంతరం అక్కడ ఉన్న విద్యార్థులు వీరిని చూసి తక్షణం స్విమ్మింగ్‌పూల్‌లో ఉన్న బాలుడిని యానాం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే బాలుడు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిలో మృతదేహం వద్ద తల్లి, బంధువులు బోరున విలపించారు. స్విమ్మింగ్‌పూల్ వద్ద సెక్యూరిటీగార్డు, రక్షణచర్యలు లేకపోవడంతోనే తన కుమారుడు మృతి చెందాడని మృతిని బం ధువులు, స్థానిక గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. యానాం పరిపాలనాధికారి కార్యాలయం ఎదు రుగా ఆందోళన చేశారు. బాలుడి కుటుంబానికి న్యా యం చేయాలని, సంఘటనలో బాధ్యులను గుర్తించి చర్యలు తీసుకోవాలని ఆందోళన చేయడంతో ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. పరిపాలనాధికారి మునిస్వామి ఆసుపత్రిలో బాలుడి మృతదేహన్ని, సంఘటన జరిగిన స్విమ్మింగ్‌పూల్ ప్రాంతాలను పరిశీలించి ఆందోళన చేస్తున్న ఆందోళనకారులతో మాట్లాడారు. బాలుడి కు టుంబానికి న్యాయం జరిగేలా, నిర్వాహకులపై చర్యలుతీసుకునేలా చర్చిస్తామని తెలపడంతో ఆందోళన విరమించారు. ఈ సంఘటనపై యానాం సర్కిల్ ఇన్ స్పెక్టర్ షణ్ముగం నేతృత్వంలో యానాం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


బాలుడి మృతదేహం పరిశీలిస్తున్న మునిస్వామి.ఇన్‌సెట్‌లో సాయిరోహిత్


ఆర్‌ఏ కార్యాలయం ఎదురుగా ఆందోళన చేస్తున్న బంధువులు, గ్రామస్థులు

తండ్రీకొడుకుల బతుకు బండి ఆగింది!

- ఆగి ఉన్న మార్కెట్ లారీని ఢీకొన్న టిప్పర్ లారీ
- మరమ్మతులు చేసుకుంటున్న తండ్రీ కొడుకులు మృతి

రావులపాలెం, జనవరి 30: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం గౌతమి కొత్త వంతెన దిగువున జాతీయ రహదారిపై సోమవారం అర్ధరాత్రి ఆగి ఉన్న లారీని టిప్పర్ లారీ బలంగా ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా మరో ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన పాఠకులకు తెలిసిందే. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడు మండలం మందపాడుకు చెందిన లారీ డ్రైవర్ పేపేటి శ్రీనివాసరావు (48) అతని కుమారుడు నాగసత్యసాయి (26) ఆకివీడు నుంచి చేపల లోడు వేసుకుని లారీలో వెస్ట్‌బెంగాల్ వెళ్లారు. అనంతరం తిరుగు ప్రయాణంలో విశాఖపట్నంలో తవుడు లోడు చేసుకుని ఆకివీడు బయల్దేరారు. సోమవారం అర్ధరాత్రి రావులపాలెం గౌతమి కొత్తవంతెన దిగువన ప్రభుత్వ కళాశాలల సమీపంలో జాతీయ రహదారిపైకి వచ్చేసరికి లారీ మరమ్మతులకు గురైంది. లారీ డ్రైవర్, క్లీనర్ కిందకు దిగి మరమ్మతులు చేసుకుంటున్నారు. కాగా ఆత్రేయపురం మండలం బొబ్బర్లంకకు చెందిన టిప్పర్ లారీ డ్రైవర్ జిత్తుక రవికుమార్, క్లీనర్ ఎల్లే మణికుమార్ (వీరు బావ, బావమరుదులు) రాజమహేంద్రవరం నుంచి రావులపాలెం వైపు గ్రావెల్ లోడుతో మితిమీరిన వేగంతో వచ్చి ఆగి ఉన్న లారీని బలంగా ఢీకొట్టారు. దీంతో లారీ వద్ద మరమ్మతులు చేసుకుంటున్న తండ్రీకొడుకులు అక్కడికక్కడే మృతి చెందారు. ప్రమాద సమయంలో టిప్పర్ లారీ క్యాబిన్ ఆగి ఉన్న లారీలోకి దూసుకుపోవడంతో డ్రైవర్, క్లీనర్ లారీ క్యాబిన్‌లో ఇరుక్కుపోయారు. ఆ సమయంలో తమను రక్షించాలంటూ ఆర్తనాదాలు చేశారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు, హైవే సిబ్బంది సంఘటనా ప్రాంతానికి చేరుకుని రెండు క్రేన్ల సాయంతో సుమారు మూడు గంటలపాటు శ్రమించి క్యాబిన్‌లో ఇరుక్కుని తీవ్రగాయాలపాలైన డ్రైవర్, క్లీనర్లను బయటకు తీశారు. క్షతగాత్రులను రాజమహేంద్రవరం ఆసుపత్రికి తరలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కొత్తపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుల బంధువు పి.వెంకటకృష్ణారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు అడిషనల్ ఎస్ఐ ప్రేమ్‌కుమార్ మంగళవారం తెలిపారు.


గౌతమి వంతెన సమీపంలో జరిగిన ప్రమాదంలో టిప్పర్ లారీ ఢీకొనడంతో మార్కెట్ లారీ కిందపడి మృతి చెందిన డ్రైవర్,క్లీనర్


రోడ్డు ప్రమాదంలో ముందు ఆగిన ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొన్న టిప్పర్ లారీ

బాబోయ్ పెద్ద పులి!

- రామశింగవరంలో దూడను చంపిన వైనం
- ట్రాప్ కెమెరాల ఫలితం శూన్యం
- తూతూ మంత్రంగానే గాలింపు చర్యలు
- పొలం పనులకు వెళ్లేందుకు వణికిపోతున్న కూలీలు, రైతులు


అయ్యవరం-దూబచర్ల మధ్య అయిల్ ఫాం తోటలో పులి సంచరించే ప్రదేశాలను పరిశీలిస్తున్న అటవీ అధికారులు

నల్లజర్ల, జనవరి 30: ఐదు రోజులుగా పెద్ద పులి ప్రజలకు, అధికారులకు కంటి మీద కునుక లేకుండా చేస్తోంది. ప్రజలు, మూగ జీవుల ప్రాణాలకు రక్షణ కరువైయింది. పులి నల్లజర్ల మండల శివారు ద్వారకాతిరుమల మండలం రామశింగవరం గ్రామంలో ఓ దూడను మంగళవారం ఉదయం చంపి సమీపంలో ఉన్న అడవిలోకి ఈడ్చుకెళ్లి మాంసం తినేసింది. సోమవారం పుల్లలపాడు ఫారెస్ట్ నుంచి నేరుగా చీపురుగూడెం ఫారెస్ట్ మీదుగా చాదరాశికుంట-రామశింగవరం వెళ్లినట్టు పాదముద్రలను ఫారెస్ట్ అధికారులు గుర్తించారు.

అధికారులు స్పందించడం లేదు

పెద్ద పులి కనిపించిందని గ్రామస్థులు ఫారెస్ట్ అధికారులకు సమాచారం ఇచ్చిన వెంటనే స్పందించడం లేదని పలు గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పులి వచ్చిన 5,6 గంటలకు వచ్చి తూతూ మంత్రంగా పాదముద్రలు సేకరించి వెళ్లిపోతున్నారని చెబుతున్నారు. నల్లజర్ల మండలంలో 9 ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేసినప్పటికీ ఒక్క కెమెరాలోను పులి జాడ కానరాలేదు.

ప్రజలు, మూగ జీవాలకు రక్షణ కరువు

పెద్ద పులి సంచరిస్తుందని పదే పదే ప్రజలు గగ్గోలు పెడుతున్నా ఫారెస్ట్ అధికాలు మిగతా ప్రభుత్వ విభాగాల అధికారులను సమన్వయం చేసుకోకుండా ఒంటరిగా వచ్చి వెళుతున్నారు తప్ప ప్రజలకు, పశువుల పెంపకందారులకు భరోసా కల్పించలేకపోతున్నారు. పొలం పనులకు వెళ్లాలంటే వ్యవసాయ కూలీలు, రైతులు భయపడిపోతున్నారు. పులి సంచరిస్తున్న గ్రామాల్లో పోలీసులు, ఇతర శాఖల అధికారులతో సమన్వయమై ప్రజలు, మూగజీవాల ప్రాణాలకు రక్షణ కల్పించాలని కోరుతున్నారు. అవసరమైతే గ్రామంలోని కొంతమంది యువకులను వలంటీర్లుగా ఉపయోగించుకోవాలని చెబుతున్నారు.


పులి పాదముద్ర(ఫైల్)

విద్యుదాఘాతంతో యువకుడు మృతి

ద్రాక్షారామ, జనవరి 30: బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలం అన్నాయిపేటలో మంగళవారం విద్యుత్‌ఘాతానికి గురై వెల్ల గ్రామానికి చెందిన వాసంశెట్టి మునీంద్ర(32) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వెల్ల గ్రామానికి చెందిన వాసంశెట్టి మునీంద్ర రాడ్ బెండింగ్ పనిచేస్తుంటాడు. మంగళవారం ఉదయం అన్నాయిపేటలో అల్లం రామకృష్ణ ఇంటివద్ద శ్లాబ్ పనిచేస్తూ ఉండగా ప్రమాదవశాత్తూ ఇనుప ఊచ కరెంటు తీగలకు తగలడంతో విద్యుత్‌షాక్‌కు గురై అపస్మారకస్థితికి చేరుకున్నారు. రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ద్రాక్షారామ ఎస్ఐ జి.సురేంద్ర కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

గొల్లప్రోలురూరల్, జనవరి 30: కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలులో మంగళవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మరణించాడు. కాకినాడరూరల్ మండలం వాకలపూడిలో నివాసముంటున్న చింతల వీరబాబు (30) రౌతులపూడి మండలం ఎస్.పైడిపాల వెళ్లి మోటార్‌సైకిల్‌పై తిరిగి వస్తున్నాడు. చేబ్రోలు పెద్దచెరువు వద్దకు వచ్చేసరికి ముం దు వెళుతున్న ట్రాలీ సడన్‌బ్రేక్ వేయడంతో ఢీకొట్టాడు. ప్రమాదంలో వీరబాబు అక్కడికక్కడే మరణించాడు. గొల్లప్రోలు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పొట్టిలంక చెక్‌పోస్టు వద్ద
నగదు, వెండి వస్తువులు స్వాధీనం

కడియం, జనవరి 30: పొట్టిలంక చెక్‌పోస్టు వద్ద మంగళవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కారులో ఎటువంటి బిల్లులు లేకుండా తీసుకెళ్తున్న రూ.1,50,000 నగదు, మరో కారులో బిల్లులు లేకుండా తీసుకెళ్తున్న రూ.4,50,000 విలువైన 6.5 కిలోల వెండి వస్తువులు సీజ్ చేసినట్టు పోలీసులు తెలిపారు. కడియం ఇన్‌స్పెక్టర్ బి.తులసీధర్ మాట్లాడుతూ ప్రజలు ఎక్కువ మొత్తంలో నగదు, వస్తువులు తీసుకెళ్లే సమయంలో ఆధారాలు ఉండాలని, లేకుంటే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.


నగదు, వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్న పోలీసులు

'రాజకీయ పార్టీలు సహకరించాలి'

కార్పొరేషన్(కాకినాడ) జనవరి 30: ఓటర్ల ప్రత్యేక సంక్షిప్త సవరణ 2024లో భాగంగా చనిపోయిన ఓటర్లను జాబితా నుంచి తొలగించే విషయంలో రాజకీయ పార్టీలు కూడా సహాయ సహకారాలు అందించాలని సిటీ ఈఆర్వో, కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు కోరారు. నగరపాలకసంస్థ కార్యాలయంలో రాజకీయపార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. డెత్ సర్టిఫికెట్లు అందుబాటులో ఉంటే ధ్రువీకరించుకుని ఓటు తొలగించే అవకాశం ఉంటుందని, ఈ విషయంలో ప్రజలు సహకరించాలని కోరారు.

'విభజన హామీలను తక్షణం అమలుచేయాలి'

కాకినాడ సిటీ, జనవరి 30: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన చట్టం హామీలు తక్షణం అమలుచేయాలని ఆమ్‌ఆద్మీ పార్టీ కాకినాడ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. కాకినాడలో ఇంద్రపాలెం బ్రిడ్జి బాబా సాహెబ్ అంబేడ్కర్ విగ్రహం వద్ద జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. జిల్లా కన్వీనర్ నరాల శివ మాట్లాడుతూ చివరి పార్లమెంట్ సమావేశాల్లోనైనా కేంద్రప్రభుత్వంపై రాష్ట్ర ఎంపీలు ఒత్తిడి తెచ్చి ప్రత్యేక హోదా, విభజన చట్టం హామీల అమలు కోసం కృషి చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి కృష్ణమోహన్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఎస్‌వీఎస్ రామారావు, రాష్ట్ర కార్యనిర్వాహక సభ్యుడు మహమ్మద్ రియాజ్, జిల్లా కోకన్వీనర్ మేడిశెట్టి రామ్మోహన్, జిల్లా సంయుక్త కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి, కాకినాడ సిటీ కార్యదర్శి గ్రంధి నాగేశ్వరరావు, మహిళ కన్వీనర్ కె.మహాలక్ష్మి, నరాల తులసి, పేపకాయల దుర్గ ఉన్నారు.

'రైతులకు అన్యాయం చేస్తున్న ప్రభుత్వాలు'

ప్రత్తిపాడు, జనవరి 30: రైతాంగం, కార్మికులకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అన్యాయం చేస్తున్నాయని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ కేంద్ర కమిటీ సభ్యుడు బుగతా బంగార్రాజు విమర్శించారు. మండలంలోని చింతలూరులో మంగళవారం నియోజకవర్గ లిబరేషన్ పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా బంగార్రాజు మాట్లాడుతూ రాష్ట్రానికి అన్ని రాజకీయ పార్టీలు అన్యాయం చేశాయన్నారు. విభజన హామీలు అమలు చేయడంలో పాలక ప్రభుత్వాలు,విపక్ష పార్టీలు విఫలమయ్యాయన్నారు. ప్రత్తిపాడు, తుని, పిఠాపురం, జగ్గంపేట నియోజకవర్గాల్లో లిబరేషన్ పార్టీ విస్తృత సమావేశాలు నిర్వహించాలని లిబరేషన్ నాయకులు ఏగుపాటి అర్జునరావు, రేచకట్ల సింహాచలం, మానుకొండ లచ్చబాబు కోరారు. సమావేశంలో సామిరెడ్డి నారాయణ మూర్తి, పేరూరి లక్ష్మి, సీతారాల రత్నం, ఎస్.కుమారి, వి.సత్తిబాబు, నూకరాజు, తాడి నాగేశ్వరరావు, బీరా దేవతయ్య, రాజాల రత్నం, రేచుకట్ల రాంబాబు పాల్గొన్నారు.

'టీడీఆర్ బాండ్ల జారీ వల్ల నష్టం లేదు'

కార్పొరేషన్ (కాకినాడ), జనవరి 30: ప్రజా ప్రయోజనాల కోసం 132/33 కేవీ ఎలక్ట్రికల్ సబ్ స్టేషన్ నిర్మాణం నిమిత్తం సేకరించిన ప్రైవేటు భూమికి టీడీఆర్ బాండ్ల జారీ వల్ల కార్పొరేషన్‌కు, ప్రభుత్వానికి ఏ ఆర్థిక నష్టం కలుగలేదని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు స్పష్టం చేశారు. కార్పొరేషన్ భూమి, ప్రభుత్వ భూమి అందుబాటులో లేకపోవడం వల్లే దుమ్ములపేట ఏరియా టీఎస్ నంబర్ 1986/3డి2, 1989/1ఏ 4ఏ, బ్లాక్ నంబర్ 49, వార్డు నంబర్2లో 4 ఎకరాల 67 సెంట్లు భూమి సేకరించామన్నారు. బిల్డింగ్ డెవలప్‌మెంట్‌లో నిబంధనలు సడలింపు మినహాయింపులో మాత్రమే టీడీఆర్ బాండ్లు ఉపయోగపడతాయన్నారు.

రహదారి భద్రతా మాసోత్సవాలు

కాకినాడ సిటీ, జనవరి 30: రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా రోడ్డు రవాణా సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం కాకినాడ లారీ ఓనర్స్ అసోసియేషన్ భవనంలో మెడికోవర్, పోలిక్లినిక్, నయన కంటి ఆసుపత్రి సహకారంతో లారీ డ్రైవర్లు, క్లీనర్లకు వైద్య శిబిరం, రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా ఎస్పీ ఎస్.సతీష్ కుమార్ ముఖ్య అతిథిగా విచ్చేసి రక్తదానం చేసిన వారికి రూ.లక్ష విలువైన ఇన్సూరెన్స్ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రోడ్డు భద్రతా మాసోత్సవాలు పురస్కరించుకుని ప్రజలకు విస్తృత అవగాహన కల్పిస్తూ ప్రమాదాల సంఖ్య తగ్గిస్తున్నామన్నారు. కార్యక్రమంలో రవాణా శాఖ ఉప కమిషనర్ ఏ.మోహన్, ఆర్టీవో పి.సాయిప్రసాద్, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ బి.మురళీకృష్ణ, ఎం.హరనాథ్‌రెడ్డి, డాక్టర్ పద్మావతి, ఇతర అధికారులు జీజీహెచ్ సిబ్బంది పాల్గొన్నారు.

రైల్వే భద్రతపై విద్యార్థులకు అవగాహన

కాకినాడ క్రైం జనవరి 30: రైల్వే భద్రతను మరింత కట్టుదిట్టం చేసిన నేపథ్యంలో జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్ పోలీసులు మంగళవారం విద్యార్థులకు అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. కాకినాడ లైన్ ఇన్‌స్పెక్టర్ గౌస్ బేగ్ ఆధ్వర్యంలో శ్రీరాంనగర్ మున్సిపల్ హైస్కూల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో గౌస్ బేగ్ మాట్లాడుతూ రైల్వే భద్రత కోసం, రైలు ప్రయాణంలో జరిగే ప్రమాదాల నివారణకు తీసుకునే ముందస్తు జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా అసాంఘిక శక్తుల వల్ల జరిగే అవాంఛనీయ సంఘటనలు అనగా రాళ్లు రువ్వడం తదితర అంశాలపై వివరించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, గవర్నమెంట్ రైల్వే పోలీస్, రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ అధికారులున్నారు.

సామర్లకోటలో అవగాహన సదస్సు

సామర్లకోట, జనవరి 30: రైల్వే ప్రయాణాల్లో ప్రమాదాల బారి నుంచి, దొంగల బారి నుంచి రక్షించుకోవడం తదితర అంశాలపై సామర్లకోట రైల్వేస్టేషన్ ఆవరణలో మంగళవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. స్టేషన్ మేనేజర్ ఎం.రమేష్, లైన్స్ ఇన్‌స్పెక్టర్ గౌసియాబేగ్, రైల్వే ఎస్ఐ బి.లోవరాజు, ఆర్పీఎఫ్ ఎస్ఐ రామకృష్ణ పాల్గొన్నారు. రైలు ప్రయాణంలో జరిగే ప్రమాదాలు, అవాంఛనీయ సంఘటనలు, రాళ్ళు రువ్వడం, రైలులో నిషేధిత గంజాయి అక్రమ రవాణా, మండే వస్తువులను తీసుకెళ్లడం, రైలులో జరిగే నేరాలు, చోరీలు, సీసీ కెమెరాల భద్రత వంటి అంశాలపై సమగ్రంగా చర్చించారు. రైల్వే ప్రయాణికులను మరింత చైతన్యవంతులను చేయాలని నిర్దేశించారు.

త్యాగరాజస్వామి ఆరాధన మహోత్సవాలు

పిఠాపురం, జనవరి 30: పిఠాపురంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో కొలువై ఉన్న త్యాగరాజస్వామి ఆరాధనా మహోత్సవాలు మంగళవారం ఘనంగా జరిగాయి. త్యాగరాజస్వామికి విశేషపూజలు జరిగాయి. స్థానిక కళాకారులు త్యాగరాజ కీర్తనలు ఆలపించారు. జగదానందకారక, దుడుకుగల సాగించేనే, కనకనరుచి, ఎందరో మహానుబావులు తదితర కీర్తనలు భక్తులను అలరించారు. కార్యక్రమాల్లో ఆలయ ఈవోనున్న శ్రీరాములు, అర్చకుడు వి.విజయజనార్ధనాచార్యులు, వింజమూరి గాయత్రి, ఆకొండి వెంకట్రావు శిష్యబృందం, గట్టి శ్రీకృష్ణదేవరాయులు తదితరులు పాల్గొన్నారు.

త్యాగరాజ వర్ధంతి

సర్పవరం జంక్షన్, జనవరి 30: కాకినాడ రూరల్ సర్పవరంలో శ్రీభవానీ సమేత నీలకంఠేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో వాగ్గేయకార మండపంలో మంగళవారం త్యాగరాజ వర్ధంతిని నిర్వహించారు. సంగీత విద్వాంసురాలు పెద్దాడ సూర్యకుమారి ఆధ్వర్యంలో కాకినాడ పరిసర ప్రాంతాలకు చెందిన విద్వాంసులు, విద్యార్థులతో కలసి సంగీత కచేరి నిర్వహించారు. అనంతరం పంచరత్న సేవా కార్యక్రమం జరిపారు. కచేరిలో సంగీత విద్వాంసురాలు ఆకొండ శ్రీనివాస, రాజారావు, చెలుకూరి సుబ్బలక్ష్మి, ప్రభల రాజేశ్వరి, వారణాసి విజయలక్ష్మి, వారణాసి వాణి, కేసరాజు శారదాదేవి త్యాగరాజ కృతులను ఆలపించారు. ఎన్‌ఎఫ్‌సీఎల్ మూర్తి, నరసింహమూర్తి పాల్గొన్నారు.

గ్రంథాలయం ప్రారంభం

కాకినాడ రూరల్, జనవరి 30: మహాత్మాగాంధీ ఐడియాలజీని విద్యార్థుల్లో వ్యాప్తి చేయడానికి గాంధీతత్వాన్ని అధ్యయనం చేయడానికి గాంధీ అధ్యయన కేంద్రాన్ని కాకినాడ విద్యుత్‌నగర్‌లోని ఐడియల్ కళాశాలలో ప్రారంభించడం అభినందనీయమని కేఎస్‌పీఎల్ సీవోవో మెర్ల మురళీధర్ అన్నారు. ఈ కేంద్రంలోని గాంధీయన్ గ్రంథాలయాన్ని రెడ్‌క్రాస్ చైర్మన్ వైడీరామారావు ప్రారంభించారు. కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ పి.చిరంజీవినీకుమారి, అకడమిక్ డైరెక్టర్ మెర్ల రంజిత్, ప్రిన్సిపాల్ డాక్టర్ టి.సత్యనారాయణ, అధ్యయన కేంద్రం కన్వీనర్ స్వామీజీ,కామరాజు, వాసు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల అందజేత

పిఠాపురం రూరల్, జనవరి 30: పిఠాపురం మండలపరిషత్ కార్యాలయంలో ఆడుదాం ఆంధ్ర నియోజకవర్గ స్థాయి క్రీడాపోటీల్లో విజేతలకు కాకినాడ ఎంపీ వంగా గీతావిశ్వనాథ్, పిఠాపురం ఎమ్మెల్యే పెండెం దొరబాబు షీల్డులు, నగదు పురస్కారాలు అందజేశారు. ఎమ్మెల్యే కార్యాలయం వద్ద వైఎస్సార్ ఆసరా కార్యక్రమం ద్వారా పిఠాపురంలోని మహిళాశక్తి సంఘాలకు మంజూరైన నిధులను వారు పంపిణీ చేశారు.

వ్యక్తి ఆత్మహత్య

సామర్లకోట, జనవరి 30: సామర్లకోట రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధి పిఠాపురం ట్రాక్‌లో అయిదు తూములు సమీపాన సామర్లకోట గాంధీనగర్‌కు చెందిన మామిడాల ప్రభాకర్(26) రైలు కింద తలపెట్టి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రైలు లోకో పైలట్ రవికుమార్ ఇచ్చిన సమాచారంతో సామర్లకోట స్టేషన్ సూపరింటెండెంట్ పి.అనంతలక్ష్మి రైల్వే పోలీసులకు మంగళవారం ఉదయం ఫిర్యాదు చేశారు. రైల్వే పోలీసులు సంఘటనా స్థలికి చేరుకుని ప్రాథమిక దర్యాప్తు నిర్వహించారు. మృతదేహం వద్ద లభించిన ఆధారాలతో వీరప్రభాకర్‌గా గుర్తించారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం పెద్దాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్టు తెలిపారు.

సినిమా గైడ్

కాకినాడ

ఆనంద్ సినిమాస్ 4 స్క్రీన్స్: నా సామిరంగ, సైంధవ్, గుంటూరు కారం, హనుమాన్, 105 మినిట్స్, కెప్టెన్ మిల్లర్

దేవీ మల్టీప్లెక్స్ 4 స్క్రీన్స్: నా సామిరంగ, సైంధవ్, గుంటూరు కారం, హనుమాన్, కెప్టెన్ మిల్లర్

తిరుమల	:	సైంధవ్
లక్ష్మి	:	ఫైటర్
సీ అండ్‌సీ1	:	గుంటూరు కారం
సీ అండ్‌సీ2	:	హనుమాన్
శ్రీప్రియ	:	నా సామిరంగ
పద్మప్రియ	:	గుంటూరు కారం
సత్యగౌరి	:	నా సామిరంగ
సూర్య 1	:	గుంటూరు కారం
సూర్య 2	:	హనుమాన్

దౌర్జన్యం చేసిన వ్యక్తులపై కేసు నమోదు

కొత్తపల్లి, జనవరి 30: రొయ్యల చెరువులకు విద్యుత్ రాయితీ మంజూరు కాలేదని కోపంతో కొత్తపల్లి తహశీల్దార్ కార్యాలయం వద్ద ఫిషరీష్ అసిస్టెంట్ చాగంటి పరుశురాముడిపై వైసీపీ రాష్ట్ర నాయకుడు రావు చిన్నారావుతో పాటు మరి కొంతమంది దౌరన్యం చేయడం విదితమే. ఈ సంఘటనపై చిన్నారావుతోపాటు మరో ఇద్దరిపై మంగళ వారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు కొత్తపల్లి ఎస్ఐ పి.స్వామి నాయుడు తెలిపారు.

గాంధీజీ బాటలో అందరూ పయనించాలి

పెద్దాపురం ఆర్డీవో సీతారామారావు

మహాత్ముడి వర్ధంతి సందర్భంగా ఘన నివాళి



పెద్దాపురంలో గాంధీ చిత్రపటానికి నివాళి



ప్రత్తిపాడు: ఏలేశ్వరంలో గాంధీ విగ్రహానికి నివాళి

పెద్దాపురం, జనవరి 30: జాతిపిత మహాత్మ గాంధీజీ బాటలో ప్రతీ ఒక్కరూ పయనించాలని, లౌకిక భార తదేశాన్ని కాపాడుకోవడం, గాంధీజీ కలలను నిజంచేయడం ఆయనకు మనం ఇచ్చే ఘనమైన నివాళి అని ఆర్డీవో జె.సీతారామారావు పేర్కొన్నారు. మంగళవారం ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మహాత్ముడు చాలా వివక్షను ఎదుర్కొన్నాడని, అలాంటి వివక్షను ఎవరూ ఎదుర్కొనకూడదని దానిని రూపుమాపేందుకు పోరాడాలని కోరారు. కార్యక్రమంలో కార్యాలయ ఏవో వెంకటలక్ష్మి, భానుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సామర్లకోట: సామర్లకోట మున్సిపల్ కార్యాలయం ఆవరణలో గాంధీజీ విగ్రహానికి పెద్దాపురం ఆర్డీవో జె.సీతారామారావు, మున్సిపల్ కమిషనర్ జాస్తి రామారావులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. తహశీల్దార్ కార్యాలయంలో గాంధీజీ చిత్రపటానికి డిప్యూటీ తహశీల్దార్ ఆర్.శ్రీనివాస్ సిబ్బంది పూలమాలలు వేసి నివాళులర్పించారు. సర్వే డీటీ పవన్‌కుమార్, వీఆర్వో రాంజీ, శ్రీహరి పాల్గొన్నారు. రైల్వేస్టేషన్ ఆవరణలో స్టేషన్ మేనేజర్ ఎం.రమేష్ ఆధ్వర్యంలో గాంధీజీకి పూలమాల వేశారు.

జగ్గంపేట: స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపం వద్ద జగ్గంపేట ఆర్యవైశ్యసేవా సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సంఘం అధ్యక్షుడు కొత్త కొండబాబు హాజరై గాంధీజీ, పొట్టి శ్రీరాములు విగ్రహాలకు పూలమాలలు వేసి అంజలి ఘటించారు. కార్యక్రమంలో బొండా నూకబాబు, బొండా వీరసత్య, కొత్త సుధీర్, దారాశ్రీనివాస్, కంచర్ల సత్యనారాయణ, కంచర్లశ్రీను, మానేపల్లి వీర్రాజు గుప్తా, బొండాడ జగన్నాధం, పాబోలు సీతారామ స్వామి, ముమ్మిడివరపు సురేష్, వి.నాగసత్య, కొత్తశివరామకృష్ణ, మాతం శెట్టి సాయిబాబు ఉన్నారు.

సర్పవరం జంక్షన్: అలయన్స్ క్లబ్ ఆఫ్ స్వాతి హెల్పింగ్ హాండ్స్ అధ్యక్షుడు కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లో గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కుష్టు వ్యాధి నివారణపై అవగాహన కార్యక్రమ పోస్టర్‌ని ఆవిష్కరించారు. అలయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ కమిటీ చైర్మన్, టీడీపీ రాష్ట్ర ఆరోగ్య విభాగ కార్యనిర్వాహక కార్యదర్శి అలై డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, క్లబ్స్ వైస్ గవర్నర్ వనుం శ్రీనివాస్, కార్యదర్శి పెంకే గోవిందరాజు, సీహెచ్ వరప్రసాద్, దుర్గా సుభద్ర, గణేష్, మణికంఠ, నీలపాల శ్రీనివాస్ పాల్గొన్నారు. కాకినాడ ఐడీఏ సభ్యుల ఆధ్వర్యంలో గాంధీజీ విగ్రహానికి ఐడీఏ అధ్యక్షుడు డాక్టర్ నాగేంద్రప్రసాద్, ఐడీఏ రాష్ట్ర కన్వీనర్ అడ్డాల సత్యనారాయణ నివాళులర్పించారు.

కరప: కరప మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలోని గాంధీజీ విగ్రహానికి ఎంపీడీవో కొంకి అప్పారావు పూలమాల వేసి నివాళులర్పించారు. సర్పంచ్ సాదే ఆశాజ్యోతికుమార్, ఏవో గుత్తుల భీమశంకర రావు, ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీవో జీవీ రమణకుమార్, పెంకే సత్తిబాబు పాల్గొన్నారు. గురజనాపల్లి హైస్కూల్‌లో హెచ్‌ఎం.సాయిమోహన్, స్టాఫ్ సెక్రటరీ ఐ.ప్రసాదరావు, ఎన్‌సీసీ ఆఫీసర్ వీవీ రమణమూర్తి, టీచర్లు గాంధీజీ చిత్రపటానికి నివాళులర్పించారు.

కిర్లంపూడి: కిర్లంపూడి పీహెచ్‌సీలో డాక్టర్ రాంబాబు నాయక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జగపతినగరం గ్రామ సర్పంచ్ గుడాల శ్రీలతా రాంబాబు విచ్చేశారు. గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దివంగత కాళ్ళ దొంగబాబు కుమారుడు కాళ్ళ వెంకటేష్ రోగులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఆశ్వ శ్రీమన్నారాయణ, యల్లపు చిన్న, కురుమళ్ళ చిన్ని, మదిరెడ్డి సూరిబాబు, చిట్టిబాబు,దాడి సూరిబాబు ఉన్నారు.

ప్రత్తిపాడు: ప్రత్తిపాడు ఏగులమ్మ గుడిసెంటర్‌లో గాంధీ విగ్రహానికి పీసీసీ సభ్యులు ధర్నాల కోటశ్రీను, కందిమళ్ళ శామ్యూల్, షేక్ అంక సాహెబ్, మాదే మోస్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏలేశ్వరం షిర్డినగర్‌లో గాంధీ విగ్రహానికి 12వ వార్డు కౌన్సిలర్ సామంతుల సూర్యకుమార్, ఏఎంసీ డైరెక్టర్ పైలా విజయ్, తూర్పు లక్ష్మీపురం ఎంపీటీసీ ఇజ్జనగిరి శివప్రసాద్, కోరాడ అప్పలస్వామి, ఏటీవీ ప్రసాద్, సామంతుల శ్రీను, పతివాడ జగదీష్, సందకేశు, శాస్త్రి, దాసరి గణేష్ పూలమాలలు వేశారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి చేరికలు



జగ్గంపేటరూరల్: టీడీపీలో చేరినవారితో నెహ్రూ

జగ్గంపేట రూరల్, జనవరి 30: మండలంలోని గొల్లలగుంట గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు కలిదిండి శేఖర్‌రాజు, గొట్టుముక్కల నరసింహారాజు, ఉపసర్పంచ్ రాయుడు అర్జున్, వార్డు సభ్యులు తలారి ఏసు, రేగుళ్ళ రమణ, మాజీ సర్పంచ్ టేకుమూడి సూర్యచంద్ర, గంజా సత్తిబాబు తదితర 100 మంది వైసీపీకి రాజీనామా చేసి టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ సమక్షంలో టీడీపీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ ప్రతీ కార్యకర్త, నాయకుడు రాష్ట్రంలో టీడీపీ, జనసేన పార్టీలు కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, కొత్త కొండబాబు, జీను మణిబాబు, బస్వా చినబాబు, పైడిపాల సూరిబాబు, సుంకవిల్లి రాజు, కుంచే తాతాజీ, పాఠంశెట్టి బాబ్జి,వెలిశెట్టి శ్రీను, తిరుమల రాజు మురళి రాజు, చిత్రపు బాబు, చింతుకుల ఈశ్వరరావు, రాయుడు వీరబాబు, కృష్ణంరాజు, రాయుడు గోవిందు, కుందపు రమేష్, వైభోగుల కృష్ణ అడపా తాతాజీ తదితరులు ఉన్నారు.

జగ్గంపేట: జగ్గంపేట మండలం ఇర్రిపాక జ్యోతుల నెహ్రూ స్వగృహంలో కిర్లంపూడి మండలం వీరవరం గ్రామానికి చెందిన గ్రామ పంచాయతీ 6వ వార్డు సభ్యుడు, వైసీపీ నేత దంటు వెంకన్న టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ సమక్షంలో టీడీపీలో చేరారు. గ్రామ టీడీపీ అధ్యక్షుడు గొల్లపల్లి సూరిబాబు, వీరవరం గ్రామ యువనేత మరోతు రామాంజనేయులు, రావులపూడి స్వామి, రావులపూడి దొరబాబు, మరోతు శివబాబు తదితరులు ఉన్నారు

లింగంపర్తిలో...

ప్రత్తిపాడు: ఏలేశ్వరం మండలం లింగంపర్తి గ్రామంలో వైసీపీకి చెందిన 20 కుటుంబాలు ఆ పార్టీని వీడి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి వరుపుల సత్యప్రభ రాజా సమక్షంలో టీడీపీలో చేరారు. వారందరికీ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరినవారిలో ఏడిద వీర నాగు, కొల్లి చింత బాబు, దూలిపల్లి కరుణ, శ్రీమంతుల సత్తిబాబు, కె.లోవరాజు, ఎం.చిన్న, నానిబాబు, షేక్ మదీనా బాషా ఉండగా మాజీ జడ్పీటీసీ జ్యోతుల పెదబాబు, టీడీపీ రాష్ట్ర ఎస్సీసెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ నూకతాటి ఈశ్వరుడు, మండల తెలుగు యువత అధ్యక్షుడు పెంటకోట శ్రీధర్, సుందరపల్లి శ్రీను పాల్గొన్నారు.



ప్రత్తిపాడు: టీడీపీ కండువా కప్పుతున్న సత్యప్రభ



విద్యార్థులతో మాట్లాడుతున్న హేమచంద్రారెడ్డి

'నూతన ఆవిష్కరణలు చేపట్టాలి'

జేఎన్టీయూకే, జనవరి 30: విద్యార్థులు ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకుని, నూతన ఆవిష్కరణలు చేపట్టాలని ఏపీఎస్సీహెచ్ఈ చైర్మన్ కె.హేమ చంద్రారెడ్డి తెలిపారు. వర్సిటీలోని జంగిల్ బుక్ వద్ద హేమ చంద్రారెడ్డి యూసీఈకే, ఐఎస్టీ విద్యార్థులతో బుధవారం ఇంటరాక్టివ్ సెషన్ నిర్వహించారు. ఓడీఎల్ డైరెక్టర్ మురళీకృష్ణ అధ్యక్షత వహించగా వీసీ జీవీఆర్ ప్రసాదరాజు, ఐఎస్టీ డైరెక్టర్ ఏ.గోపాలకృష్ణ, ప్రిన్సిపాల్ కృష్ణప్రసాద్ పాల్గొన్నారు. వీసీ మాట్లాడుతూ ఏపీఎస్సీహెచ్ఈ సూచనల మేరకు జాతీయ నూతన విద్యావిధానం 2020లో భాగంగా వర్సిటీలో ఓడీఎల్, ఓఎల్ కోర్సులను ప్రవేశపెట్టనున్నామన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ సుమలత, మాలోతు రమేష్ పాల్గొన్నారు.

'సైకో పాలనకు చరమగీతం పాడాలి'


రౌతులపూడి, జనవరి 30: సైకో సీఎం జగన్ పాలనకు చరమగీతం పాడాలని మల్లంపేట గ్రామస్తులకు ప్రత్తిపాడు టీడీపీ ఇన్‌చార్జి వరుపుల సత్యప్రభ పిలుపునిచ్చారు. మంగళవారం మల్లంపేటలో మీఇంటికి- మీ రాజా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి టీడీపీ ఎన్నికల మేనిఫెస్టోను వివరించారు. గ్రామంలో మాజీ ఉపసర్పంచ్ బంగారు స్వామినాయుడు, గాడి నూకరాజుతో పాటు 50 కుటుంబాలకు చెందిన వైసీపీ కార్యకర్తలు టీడీపీలో చేరగా వారికి పార్టీ కండువాలు కప్పి సత్యప్రభ ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు తమరాల సత్యనారాయణ, ఎంపీపీ గంటిమళ్ల రాజ్యలక్ష్మి, మాజీ సర్పంచ్‌లు గొల్లు పెద్ద దివాణం, ఈగల సత్తిబాబు, శీరంరెడ్డి లోవరాజు, లవుడు నాగేశ్వరరావు, రెడ్డి రాజ్‌గోవింద్, గాడి తాతబాబు తదితరులు ఉన్నారు.

'సమన్వయంతో పనిచేయాలి'

కరప, జనవరి 30: అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి చొల్లంగి తీర్థాన్ని పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీవో కొంకి అప్పారావు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం పలువురు అధికారులు, సిబ్బందితో ఆయన తీర్థం ఏర్పాట్లపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఫిబ్రవరి 9న ఉప్పలంక శివారు మొండి వద్ద చొల్లంగి తీర్థం జరగనుందన్నారు. భక్తుల తాకిడి ఎక్కువగా ఉంటుందని, అందుకు ఏర్పాట్లు చేయాలని సూచించారు.

అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం

కరప, జనవరి 30: అరట్లకట్ట, గొడ్డటిపాలెం, కొరుపల్లి గ్రామాల్లో మంగళవారం ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పర్యటించి రూ.3.07కోట్ల విలువతో పూర్తిచేసిన పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం చేశారు. అరట్లకట్ట వద్ద కాకినాడ కెనాల్‌పై రూ.1.10కోట్లతో నిర్మించిన వంతెనను ప్రారంభించారు. నాడు-నేడు నిధులతో స్థానిక హైస్కూల్, మండలపరిషత్ పాఠశాలల్లో చేసిన అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మీసత్తిబాబు, జడ్పీటీసీ యాళ్ల సుబ్బారావు, సర్పంచ్‌లు గోపి సత్యవేణి, వాసంశెట్టి శ్రీనుబాబు, పలివెల నాగేశ్వరరావు, సాదే ఆశాజ్యోతి, రొక్కాల గణిరాజు, ఎంపీటీసీ దేవిశెట్టి సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



అరట్లకట్టలో బ్రిడ్జికి ప్రారంభోత్సవం చేస్తున్న ఎమ్మెల్యే

రాబోయేది తెలుగుదేశం ప్రభుత్వమే

టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వర్మ




నాగులాపల్లిలో కరపత్రాలను అందజేస్తున్న వర్మ

కొత్తపల్లి, జనవరి 30: రాబోయేది తెలుగుదేశం ప్రభుత్వమేనని, అధికారంలోకి రాగానే నాగులాపల్లి గ్రామాన్ని తాను దత్తత తీసుకుని నియోజకవర్గంలో నెం-1 స్థానంల అభివృద్ధి చేస్తానని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్‌వీఎస్ఎన్ వర్మ హామీఇచ్చారు. బాబు ష్యూరిటీ- భవిష్యత్తు గ్యారంటీ, మన ఇంటికి మన వర్మ కార్యక్రమం మంగళవారం నాగులాపల్లిలో నిర్వహించారు. వర్మ మాట్లాడుతూ గత ఐదేళ్లలో ఎమ్మెల్యేఎంపీ గానీ నాగులాపల్లి రైతులకు ఉపయోగపడే వర కాలువ వంతెన, కళింగలు కానీ నిర్మించలేకపోయారన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక వరకాలువ, కళింగల నిర్మాణాలు చేపడతామని వర్మ రైతులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ కొత్తపల్లి మండలాధ్యక్షుడు అనిశెట్టి సత్యానందరెడ్డి, రమణక్కపేట నీటి సంఘ అధ్యక్షులు పెనుమల్లు కృష్ణారెడ్డి, కడిమిశెట్టి చక్రంరెడ్డి, సత్యనారాయణరెడ్డి, బిళ్ళకుర్తి ప్రభాకరరెడ్డి, అబ్బాయిరెడ్డి తదితరులు ఉన్నారు.

'ప్రభుత్వానికి ఎదురుదెబ్బ'

టీడీపీ అధినేత చంద్రబాబుపై పెట్టిన అక్రమ కేసుల్లో ఒకటైన ఇన్నర్ రింగ్‌రోడ్డు కేసులో జగన్ ప్రభుత్వానికి ఎదురుదెబ్బ తగిలిందని వర్మ అన్నారు. ఈ మేరకు కొత్తపల్లిలో ప్రకటన విడుదల చేశారు. చంద్రబాబు బెయిల్ రద్దు చేయాలని ప్రభుత్వం వేసిన పిటిషన్‌లను సుప్రీంకోర్టు కొట్టివేయడం ప్రభుత్వానికి చెంపపెట్టని అన్నారు.

'అభివృద్ధి, సంక్షేమం టీడీపీతోనే సాధ్యం'



తునిలో ప్రచారం నిర్వహిస్తున్న యనమల దివ్య

తుని రూరల్, జనవరి 30: అభివృద్ధి, సంక్షేమం టీడీపీతోనే సాధ్యమని.. రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన కూటమికి ఓట్లు వేసి ప్రజా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని తని టీడీపీ ఇన్‌చార్జి యనమల దివ్య కోరారు. తుని 13వ వార్డులో టీడీపీ ఆర్గనైజింగ్ సెక్రటరీ యనమల కృష్ణుడుతో కలిసి ఇంటింటా ప్రచారం చేపట్టారు. టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. మేనిఫెస్టోలో పొందుపరిచిన సూపర్ సిక్స్ పథకాలు అన్నివర్గాలకు మేలు జరుగుతుందన్నారు. టీడీపీ సీనియర్ నాయకులు పోల్నాటి శేషగిరి రావు, మోతుకూరి వెంకటేష్, చోడిశెట్టి గణేష్, అప్పన రమేష్, మళ్ళ గణేష్, పలువురు ఉన్నారు.

కృష్ణాపురంలో ప్రచారం

తొండంగి మండలం కృష్ణాపురం గ్రామంలో యనమల దివ్య కృష్ణుడుతో కలిసి ఇంటింటా ప్రచారం చేపట్టారు. వైసీపీ పాలనలో అవినీతి అక్రమాలు తప్ప అభివృద్ధి శూన్యమని పేర్కొన్నారు. మండల టీడీపీ నాయకులు పేకేటి హరికృష్ణ, మొరాల శెట్టి సత్యనారాయణ, బెండపూడి నాయుడు, చొక్కా నాని, తాటిపర్తి శ్రీనివాస్, సూరాడ రాంబాబు, గాబు నారాయణరావు ఉన్నారు.

'గ్రంథాలయాల్లో సదుపాయాలను ఆధునికీకరించాలి'

కాకినాడ సిటీ, జనవరి 30: ప్రజల్లో పుస్తక పఠనాశక్తిని పెంచేలా జిల్లాలోని గ్రంథాలయాల్లో సదుపాయాలను ఆధునికీకరించాలని జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ అధికారులను కోరారు. తూర్పుగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ బడ్జెట్, సర్వసభ్య సమావేశం మంగళవారం సంస్థ పర్సన్ ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్ ఇలక్కియ అధ్యక్షతన కలెక్టరేట్‌లోని ఆమె ఛాంబర్‌లో జరిగింది. 2023-24కి సవరించిన బడ్జెట్ అంచనాలు, 2024-25కి బడ్జెట్ ప్రతిపాదనలపై చర్చించి ఆమోదించారు. వివిధ ప్రభుత్వ గ్రాంట్లు, గ్రంథాలయ సెస్ నిధులతో పుస్తకాలు, పత్రికల కొనుగోళ్లు, శాఖా గ్రంథాలయాల భవనాలకు మరమ్మతులు, అద్దెల చెల్లింపు, సిబ్బంది జీత భత్యాలు తదితర పద్దుల కింద అంచనాలతో ప్రతిపాదనలు రూపొందించారు. జిల్లాలో శాఖా గ్రంథాలయాలు, గ్రామీణ గ్రంథాలయాలు లేని చోట్ల పుస్తక పంపిణీ కేంద్రాల ఏర్పాటు, కేర్‌టేకర్‌ల నియామకానికి ఆమోదం తెలిపారు. సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వీఎల్ఎన్ఎస్ వరప్రసాద్, విద్య, పంచాయతీ, వయోజన విద్య, సమాచార పౌర సంబంధాల శాఖ అధికారులు పాల్గొన్నారు.

కారు ఢీకొని వ్యవసాయ కూలీ మృతి

తుని రూరల్, జనవరి 30: 16వ నెంబరు జాతీయ రహదారిపై తేటగుంట జంక్షన్ వద్ద రోడ్డు ప్రమాదంలో వ్యవసాయ కూలీ మృతిచెందాడు. తుని రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... తేటగుంట గ్రామానికి చెందిన గొర్ల నాగేశ్వరరావు(42)వ్యవసాయ పనులు నిమిత్తం పొలంలోకి వెళ్తుండగా రోడ్డు దాటే క్రమంలో విశాఖపట్నం వైపు వెళ్తున్న కారు బలంగా ఢీకొంది. తీవ్ర గాయాలైన నాగేశ్వరరావును ఆసుపత్రికి తరలించి చికిత్స అందించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

'సాంకేతికతను అందిపుచ్చుకోవాలి'



సమావేశంలో మాట్లాడుతున్న శ్యామ్‌రాజ్ నాయక్

పెద్దాపురం, జనవరి 30: వ్యవసాయంలో సాంకేతికతను అందిపుచ్చుకోవాలని రాజమహేంద్రవరం వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ చవాన్ శ్యామ్‌రాజ్ నాయక్ అన్నారు. మండలంలోని గోరింట గ్రామంలో మంగళవారం నిర్వహించిన రైతు సదస్సులో ఆయన మాట్లాడారు. రైతులను సాంకేతికంగా విజ్ఞానవంతులను చేసేందుకు వ్యవసాయ కళాశాల విద్యార్థులు వారికి అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ చల్లా వెంకటనరసింహారావు, డాక్టర్ మునిరత్నం, సీతారామాశర్మ, ఉషారాణి, సంజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పిఠాపురం కమిషనర్‌గా కనకారావు



పిఠాపురం, జనవరి 30: పిఠాపురం మున్సిపల్ కమిషనర్‌గా ఎన్.కనకారావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన డీఎంఏ కార్యాలయం నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. కనకారావును వివిధ అధికారులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఇప్పటివరకూ ఇక్కడ పనిచేసిన కృష్ణవేణి నిడదవోలు కమిషనర్‌గా బదిలీ అయ్యారు.

తిమ్మాపురం ఎస్ఐగా రవీంద్రబాబు



సర్పవరం జంక్షన్, జనవరి 30: కాకినాడ రూరల్ మండలం తిమ్మాపురం పోలీస్‌స్టేషన్ ఎస్ఐగా మంగళవారం ఎంవీవీ రవీంద్రబాబు బాధ్యతలు స్వీకరించారు. శాంతి భద్రతల పరిరక్షణ, రానున్న ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చర్యలు తీసుకుంటానన్నారు. కాగా ఇక్కడ పనిచేస్తున్న ఎస్ఐ షేక్ షరీఫ్ వన్‌టౌన్‌కు బదిలీపై వెళ్లారు.

కిర్లంపూడి ఎస్ఐగా షేక్ జబీర్

కిర్లంపూడి, జనవరి 30: కిర్లంపూడి పోలీస్‌స్టేషన్‌కు నూతనంగా ఎస్ఐగా మంగళవారం షేక్ జబీర్ బాధ్యతలు చేపట్టారు. ఆయన కాకినాడ పోర్టు ఎస్ఐగా విధులు నిర్వహించి కిర్లంపూడి బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకు ఎస్ఐగా పనిచేసిన ఉమామహేశ్వరరావు కాకినాడ బదిలీపై వెళ్లారు.

ఇద్దరికి గాయాలు

గండేపల్లి, జనవరి 30: మండలంలో బొర్రంపాలెం, గండేపల్లి జాతీయ రహదారిపై జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం ప్రకారం.. బొర్రంపాలెం జాతీయ రహదారిపై ధర్మవరం నుంచి రాజమహేంద్రవరం వెళ్తున్న జువ్వ సూరిబాబు ఒక్కసారిగా కారుకు అడ్డంగా రావడంతో కారు ఢీకొనడంతో సూరిబాబుకు స్వల్ప గాయాలయ్యాయి. అలాగే గండేపల్లి జాతీయ రహదారిపై వెంకన్నబాబు గుడి సమీపంలో జగ్గంపేట వైపు నుంచి రాజమండ్రి వెళ్తున్న ఇసుక లారీ కళాశాలకు చెందిన బత్తిన జ్యోతిష్‌కుమార్‌ను ఢీకొంది. దీంతో జ్యోతిష్ కుమార్ చేతికి గాయం కాగా చికిత్స నిమిత్తం రాజమండ్రికి తరలించారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసులకు లొంగిపోయిన గంజాయి కేసులో నిందితుడు

గండేపల్లి, జనవరి 30: గంజాయి కేసులో నిందితుడిగా ఉన్న ముక్కల ప్రకాశరావు మంగళవారం సీఐ ఎస్.లక్ష్మణరావు, ఎస్ఐ ఎన్.రామకృష్ణ ఆధ్వర్యంలో లొంగిపోయినట్టు పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 22న పాడేరు నుంచి గుంటూరుకు గంజాయి అక్రమంగా రవాణా చేస్తూ గండేపల్లి గ్రామ శివారులో పోలీసులు తనిఖీ చేస్తుండగా షేక్ బాజీబాబా పోలీసులకు దొరకగా ముక్కల ప్రకాష్ పారిపోయాడు. అయితే ప్రకాష్ మంగళవారం పోలీసులకు లొంగిపోవడంతో రిమాండ్‌కు తరలించారు.

'నష్ట పరిహారం ఇవ్వాలి'

శంఖవరం, జనవరి 30: గతేడాది తుపానుకు తీవ్రంగా నష్టపోయిన రైతులకు కాకుండా స్థానిక నేతల కుటుంబ సభ్యులకు లబ్ధి చేకూరేలా ప్రతిపాదనలు పంపారని, అవకతవకలపై విచారణ నిర్వహించి అర్హులైన రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని రైతులు కోరారు. ఈ మేరకు తహశీల్దార్, స్థానిక వ్యవసాయ అధికారికి వారు ఫిర్యాదు చేశారు.

ఉచిత దంత వైద్యసేవలు

కిర్లంపూడి, జనవరి 30: జగపతినగరం గ్రామ పంచాయతీ మంగళవారం ఉచిత దంత వైద్యసేవలు అందించారు. గ్రామ సర్పంచ్ శ్రీలతా రాంబాబు ఆధ్వర్యంలో కాకినాడ వైద్యులు రోగులకు దంత వైద్యసేవలు అందించారు. షుగర్, బీపీలకు పరీక్షలు నిర్వహించారు. మాజీ ఎంపీటీసీ చదరం చంటిబాబు, కురుమళ్ళ చిన్ని, దాడి సూరిబాబు పాల్గొన్నారు.

ఆలయంలో హుండీల లెక్కింపు

సామర్లకోట, జనవరి 30: సామర్లకోటలోని మాండవ్య నారాయణస్వామి ఆలయంలో హుండీలను మంగళవారం భక్తుల సమక్షంలో తెరిచి లెక్కించగా రూ.89,290 లభించినట్టు దేవాదాయ ఇన్‌స్పెక్టర్ వీ.ఫణీంద్రకుమార్ తెలిపారు.

తైక్వాండోలో బంగారు పతకాలు

కాకినాడ అర్బన్, జనవరి 30: ఈ నెల 20,21 తేదీల్లో నంద్యాల్లో జరిగిన రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో కాకినాడకు చెందిన క్రీడాకారులు బంగారు పతకాలు సాధించినట్టు ఉమ్మడి జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు రాయుడు శ్రీనివాసరావు తెలిపారు. విజేతలు కె.షీబా, కీర్తన, కె.నవ్యశ్రీ, కెఎంఎస్‌బీ షర్బీన్‌లను మంగళవారం ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు పద్మనాభం, లక్ష్మీనారాయణ అభినందించారు.

